## ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

స్థల పరిశీలనలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** మండలంలో 516ఇ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని కురిడి రైల్వే ట్రాక్ వదకద ఫ్లై ఓవర్ నిర్మాణానికి సోమవారం సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ స్థల పరిశీలన చేశారు.. రోడ్డు నిర్మాణంలో భాగంగా పట్టా భూములున్నా అర్హులైన గిరిజనులకు పరిహారం చెల్లిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక మండల రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసీలకు నిరాశే..



- మౌలిక వసతులకు, విద్యకు బడ్జెట్‌లో కేటాయింపులేవీ ?
- జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపుల్లేక గిరిజనుల్లో ఆగ్రహం

**ప్రజాశక్తి - అరకులోయ రూరల్ విలేకరి, అనకాపల్లి ప్రతినిధి**

సోమవారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసీలంతా గత ప్రభుత్వంలా కాకుండా ఈ ప్రభుత్వమైనా బడ్జెట్ కేటాయింపుల్లో న్యాయం చేస్తుందేమోనని ఎదురు చూడగా వారికి నిరాశే ఎదురైంది. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల, జిఓ నెంబర్ 3కి చట్టబద్ధత వంటి అంశాలపై బడ్జెట్ ప్రసంగంలో కనీస ప్రస్తావన లేకపోవడం అందరినీ బాధించింది. ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు 6.59 శాతం జరగాల్సి ఉండగా కేవలం 2.57 శాతమే కేటాయింపులు జరగడం పట్ల ఆదివాసీలంతా ఆగ్రహంతో ఉన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపైనా బడ్జెట్‌లో ప్రస్తావన కరువైంది.

ఏజెన్సీలో అక్షరాస్యత శాతం పెంచేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు సరైన కేటాయింపులు లేకుండా పోయాయి. జిసిసి అభివృద్ధి విషయంలోనూ, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనలోనూ అన్యాయమే జరిగింది. పోలవరం నిర్వాసితుల సమస్యపైనా, గిరిజన యూనివర్సిటీపై కేంద్రం నుంచి నిధులు సాధించడంపైనా ఎటువంటి హామీ ఆదివాసీలకు దక్కలేదు.

**ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.63.21 కోట్లే**

ఉమ్మడి విశాఖలోని వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికివున్న చిన్నచూపు పోలేదని తాజా బడ్జెట్‌ను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. రూ.17 వేల కోట్ల విలువైన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ బడ్జెట్‌లో రూ.63.21 కోట్లునే ప్రభుత్వం కేటాయించింది. వైసిపి ప్రభుత్వం సుజల స్రవంతికి 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించి, ఒక్క పైసా విడుదల చేయలేదు. 2024-25 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం రూ.63.21 కోట్లు కేటాయించింది. శాసనసభ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని తాండవ ప్రాజెక్టుకు తప్ప ఏ ప్రాజెక్టుకూ తగినన్ని నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. భారీ తరహా ప్రాజెక్టు తాండవ గేట్ సహా ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల మరమ్మతులు చేపట్టాల్సివుంది. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కనీస మరమ్మతులు చేయలేదు. కేటాయింపుల ప్రకారం ప్రభుత్వం నిధులు విడుదలచేస్తే తాండవ ప్రాజెక్టు ప్రధాన మరమ్మతులు జరగనున్నాయి. గత ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు కేటాయించని పెద్దేరు ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం పది వేలు కేటాయించింది. రైవాడ, కోనాంకు రూ.20 వేలు చొప్పున కేటాయించింది. కోనాంకు గత ప్రభుత్వం రూ.5.38 లక్షలు కేటాయించగా ఈ ప్రభుత్వం 20 వేలు కేటాయించింది. గత బడ్జెట్‌లో కేటాయింపుల్లేని రైవాడ ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం రూ.20 వేలు కేటాయించింది. తాండవకు మినహాయిస్తే మిగిలిన ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులు ఈ ఏడాది టీ ఖర్చులకు కూడా సరిపోవు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

**- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం**

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాలు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ, గృహ నిర్మాణ, రోడ్లు భవనాలు, ఏపీఈపీడీసీఎల్, పంచాయతీరాజ్, స్పెషల్ మైనర్ ఇరిగేషన్ తదితర శాఖల ఇంజనీరింగ్ విభాగాల ఇంజనీర్లతో సోమవారం ఐటిడిఎ పిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఈపిడిసిఎల్ ద్వారా పింజరకొండ, పాతకోట, గుర్తేడు, చింతలపూడి తదితర మారుమూల ప్రాంతాలలో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. చెక్ డ్యాం పనులు, రోడ్డు పనులు, గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, రవికుమార్, డిఇలు సాయి సతీష్, చైతన్య రామచంద్రమూర్తి, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, పి వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన చట్టాల పటిష్ట అమలుకు పోరాటం

- సిపిఎం ముంచంగిపుట్టు మహాసభలో జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- వచ్చే నెల 4, 5 తేదీల్లో జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** ఏజెన్సీలో గిరిజన హక్కులు, చట్టాలను, జిఓలను పటిష్టంగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. వీటి సాధనకు ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిస్తూ తీర్మానించారు. . సోమవారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం వద్ద మండల వైస్ ఎంపిపి- 1 బోయి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ అధ్యక్షతన పార్టీ కార్యదర్శి పాంగి భీమరాజు ఆధ్వర్యంలో మండల మహాసభను నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో అప్పలనర్స మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రజాసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాలను ఉధృతం చేయాలన్నారు. మండల వాసుల కనీస అవసరాలైన తాగునీరు, రోడ్లు, గృహాలు, విద్య, వైద్యం కల్పనకు ప్రభుత్వం, పాలకులపై ఒత్తిడి తెద్దామన్నారు. ట్రూఅప్, సర్దుబాటు పేరుతో వినియోగదారులపై వేస్తున్నవిద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 14 వరకు నిర్వహించే ప్రజాపోరులో భాగస్వాములై జయప్రదం చేయాలన్నారు.

**ఆదివాసీల జిఒలు అమలు చేయాలి**

గిరిజనులకు శతశాతం ఉద్యోగావకాశాలను కల్పించే జిఒ 3 ప్రయోజనాల పునరుద్ధరణకు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటన, అర్హులకు ఇళ్లు మంజూరుచేసి, రూ. ఆరు లక్షలను ఇంటి నిర్మాణసాయంగా అందజేయాలని కోరాడు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాల పంపిణీ, కాఫీ రైతులకు గిట్టుబాటుధర, ఉపాధి హామీ పథకంలో ఏటా 200 పనిదినాల కల్పనతోపాటు రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.మన్యవాసులకు కనీస సౌకర్యాల కల్పనతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభలో తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కొర్ర శంకరరావు, వంతల లైకోన్, జి నారాయణ, జీనబంధు, కొర్ర నర్సయ్య, ధనుర్జయ్, డోమ్రు, టి గోపాల్, శ్రీను, రామదాసు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పులి సంతోష్‌కుమార్

## ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వాలు

**ప్రజాపోరులో సిపిఎం నాయకులు సంతోష్‌కుమార్**

**ప్రజాశక్తి-విఆర్.పురం**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని సిపిఎం మండల నాయకులు పులి సంతోష్‌కుమార్ విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పార్టీ ఈనెల 8 నుండి 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేఖపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. తక్షణమే నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఆర్ పురం మండలంలో పోలవరం నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 14న స్థానిక మండల తహశీల్దారు కార్యాలయం వద్ద జరుగుతున్న ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, శ్రీరపు తాతబాబు, శాఖా కార్యదర్శి వేటగాని సూరి, నాగేశ్వరరావు, గణపతి, నరేష్, వెంకన్నబాబు, వినోద్, చిన్న, సత్తిబాబు, పోసి, రవి, రాజు, కల్లి రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి -పాడేరు:** ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ మూడు రకాల కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్‌సిడి సిడి 3.0 హౌస్ టు హౌస్ సర్వే చేసి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ పరీక్షలు చేస్తారని, వాటిని ద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. అందులో భాగంగా బిపి, షుగర్, హెచ్‌బి పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. 30ఏళ్లు నిండిన పురుషులు, మహిళలకు నోటి కేన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అసాధారణ కేసులను వైద్యాధికారులు పరీక్షించి, అనుమానితులకు మంగళ, శుక్రవారాల్లో ఫాస్ట్ ట్రాక్ ఛానెల్‌తో ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్, కెజిహెచ్‌కు రిఫర్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ మహమ్మారిని ముందుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిఓ 3 పునరుద్ధరణకు అసెంబ్లీ తీర్మానం చేయాలి

**గిరిజన యువత ర్యాలీ, ధర్నా**

**ప్రజాశక్తి-సీలేరు**

జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తూ అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీకే వీధి మండల కేంద్రంలో యువతీ యువకుల సోమవారం స్థానిక పెట్రోల్ బంకు నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ప్లకార్డు పట్టుకొని ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు సమర్పించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ జీవో నెంబర్ 3ను పునరుద్ధరించకపోవడం వలన గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అరుకు పర్యటనకు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తాము అధికారంలో వచ్చిన వెంటనే జీవో నెంబర్ 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ హామీని నెరవేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించనున్న డీఎస్సీ నోటిఫికేషన్ వల్ల గిరిజన నిరుద్యోగులకు మేలు జరగదని, ఏజెన్సీ ప్రాంత స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి మొక్కల మహేష్, మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు వనపల సోమేష్‌కుమార్, నీలకంఠం, రాజు, వైసిపి నాయకులు కొర్ర బాబీ, గిరిజన సంఘం మండల నాయకులు గమ్మెల పరమేష్, రామారావు, జీకే వీధి వైస్ సర్పంచి రాంబాబు పాల్గొన్నారు.

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న యువకులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు లక్ష్మణ్

## 14న వాలంటీర్ల జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-చింతూరు**

ఎపి గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యాన ఈ నెల 14న జరుగుతున్న రంపచోడవరం జిల్లా వాలంటీర్ల సదస్సును జయప్రదం చేయాలని చింతూరు మండల గ్రామ వార్డ్ వాలంటీర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశంలో యూనియన్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ, సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వాలంటీర్లకు రూ.10వేలు వేతనం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టిడిపి కూటమి నాయకులు, నేడు వాలంటీర్ వ్యవస్థే లేదని చెప్పడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను కేవలం రాజకీయంగా చూస్తోందని, వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి గౌరవ వేతనం పెంచాలనే ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. ముంపు మండలాల్లో పర్యటన వచ్చిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కి వాలంటీర్ తరపున వినతి ప్రతం ఇవ్వగా, ప్రభుత్వంతో చర్చించిన తర్వాత వాలంటీర్ వ్యవస్థని కొనసాగిస్తానమని చెప్పారని గుర్తు చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో వాలంటీర్ వ్యవస్థ మీద మాట్లాడాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వాలంటీర్లతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. 14న ఉదయం 9 గంటలకు యూటీఎఫ్ భవనంలో జరుగు వాలంటీర్ల జిల్లా సదస్సుకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, రంపచోడవరం సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ట వాణిశ్రీ, పల్లపు వెంకట్ హాజరై ప్రసంగిస్తారని, రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాల్లో ఉన్న వాలంటీర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కలుమూల మహేష్, సోడి దుర్గారావు, జి.వనరాజు, కట్టాం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాటు మందులు వాడి పసిపిల్లలను బలి తీయొద్దు

**చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్**

**ప్రజాశక్తి-చింతూరు**

ఏజెన్సీలో పసి పిల్లలకు పసర, నాటు మందులు వాడి వారి ప్రాణాలు బలితీయొద్దని చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ హితవుపలికారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో నాటు వైద్యులతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ అవగాహన లేకుండా మూఢనమ్మకాలతో ప్రాణాంతకమైన పసర మందులు వాడొద్దన్నారు. అనారోగ్యం కలిగితే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తరలించి సరైన వైద్యం సకాలంలో అందించి పసిపిల్లల ప్రాణాలు కాపాడాలని సూచించారు. ఎస్ఎన్‌సి కేంద్రంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, అత్యవసర పరిస్థితుల్లో 108 ద్వారా ఆసుపత్రికి చేరుకొని పిల్లలకు వైద్యం అందించాలని కోరారు. పిల్లలు అనారోగ్యంతో ఏడుస్తున్నప్పుడు సూదులు కాల్చి పొట్టలపై వాతలు వేయడం వంటి అనాగరిక చర్యలు చేపట్ట వద్దన్నారు. వాతావరణ మార్పుల వల్ల తరచూ పిల్లల్లో ఫ్లూ జ్వరాలు, జలుబు వంటివి వస్తాయని, అప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ పుల్లయ్య, నాలుగు మండలాలకు చెందిన పసర నాటు మందు గిరిజన వైద్యులు, చిన్నపిల్లల వైద్యులు, విఆర్ పురం ఎస్పై, ఏటిడబ్ల్యూ కే సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

## డ్రోన్ సాయంతో గంజాయి తోటల గుర్తింపు

**తీరు మారకుంటే కఠిన చర్యలు : ఎస్‌పి అమిత్ బర్ధర్**

డ్రోన్లతో గంజాయి తోటలను పరిశీలిస్తున్న పోలీసులు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు

**ప్రజాశక్తి -జి, మాడుగుల :** మండలంలోని సొలభం పంచాయతీ డేగలరాయి గ్రామంలో అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ ఆధ్వర్యంలో సోమవారం డ్రోన్ సహాయంతో ఐదు ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి తోటను సుమారు 1000 మొక్కలను గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి పండించవద్దని పలుమార్లు హెచ్చరించినా ఇంకా పద్ధతి మార్చుకోవడం లేదని మండిపడ్డారు. ఇలా చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగుకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందిస్తున్నా, గంజాయి సాగు వైపు వెళ్లడం శోచనీయమని,అలా చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ షణ్ముఖరావు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు

## చావడికోట పంచాయతీలో టూరిస్టులకు అనుమతి నిరాకరణ

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

మండలంలోని చావడికోట పంచాయతీలో పర్యాటకులకు అనుమతి లేదని ఆ పంచాయతీ సర్పంచ్ సాధల ప్రేమ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో గుడిస పర్యాటక ప్రాంతాన్ని గత ఐదు నెలలుగా మూసివేయడంతో చావడికోట పంచాయతీలో గల పర్యాటక ప్రాంతాలను తిలకించడానికి టూరిస్టులు వస్తున్నారని తెలిపారు. వారు ఎక్కడబడితే అక్కడ మద్యం బాటిళ్లు, బెంబో గొట్టాలు, చెత్తాచెదారం పడవేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆకు మామిడి కోట సంత మార్కెట్, ఉప్పరి గోతులు, చావడికోట గ్రామాల్లో క్యాంపింగ్ టెంట్లు వేసి బస చేయడం జరుగుతుందన్నారు. టూరిస్టులు ప్రమాదకరంగా వాహనాలు నడపడంతో గిరిజన ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని రోడ్డు మీదకు రావలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అందువల్ల చావడికోట పంచాయతీ గ్రామాల్లో పర్యాటకులకు అనుమతి నిరాకరించామని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాఫీ రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతులు

## అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కాఫీ

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ:**అరకు కాఫీ పంటకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని, తదనుగుణంగా కాఫీని తయారు చేయాలని ఐటిడిఎ కాఫీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సొవ్వ పంచాయతీ సాగరవలస, గసభ పంచాయతీ గొందివలస, మొర్రి గుడ,సాగర పంచాయతీ గ్రామాల్లోకాఫీ పంటల సేకరణ, ఐటిడిఎ, జిసిసి కొనుగోలుకు ప్రకటించిన ధరలపై గిరిజనులకు ఆ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటిడిఎ, జిసిసి ద్వారా కాఫీ పళ్ళకు కిలో రూ.44లు,పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ 285లు, చెర్రీ కాఫీ రూ.150లు చొప్పున కొనుగోలు ధరలను ఐటిడిఎ ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన ధరలకు అనుగుణంగా కాఫీ రైతులు లబ్ధిపొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక మండల కాఫీ ఉద్యానవన అధికారి ఎస్ మత్స్యరాజు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, జిసిసి సిబ్బంది, లైజన్ వర్కర్లు, కాఫీ రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలకు తాత్కాలిక భవన నిర్మాణం

**ప్రజాశక్తి - చింతపల్లి :** తమ గ్రామానికి పాఠశాల భవనం నిర్మించాలని అధికారులు, నేతలు ఏళ్లతరబడి మొరపెట్టుకున్నా హామీలే తప్ప, ఎటువంటి అమలు కార్యాచరణ లేకపోవడంతో స్థానిక సర్పంచ్, ఎంపిటిసి ముందుకు వచ్చి, సొంత నిధులతోనే తాత్కాలిక భవన నిర్మాణానికి పూనుకున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా, తమ గ్రామంలోని పాఠశాల భవనానికి మోక్షం కలగడం లేదని పులిగొంది వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

మండలంలోని మారుమూల కిటుముల పంచాయతీ పులిగొంది గ్రామంలో పాఠశాల భవనం లేక ఏళ్లతరబడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు 53 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నప్పటికీ, ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పక్కా పాఠశాల భవనం లేని దుస్థితి. దీనిపై గతంలో పలుమార్లు పాడేరు ఐటిడిఎ పిఒ, కలెక్టర్, ఇతర అధికారులతోపాటు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. వీరి అభ్యర్థనను మన్నించి, గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి నాటి ఐటిడిఎ పిఒ స్వయంగా గ్రామాన్ని సందర్శించి, పాఠశాల దుస్థితిని పరిశీలించి, పక్కా భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ కూడా ఇచ్చారు. అయితే నేటి వరకు ఎటువంటి కార్యాచరణ లేదు. నాడు నేడు లో పాఠశాల భవనం మంజూరైనప్పటికీ అసంపూర్తిగా నిలిచిపోవడంతో, పులిగొంది పాఠశాలకు వసతి కష్టాలు తీరని పరిస్థితినెలకొంది.

పాఠశాల భవనానికి ఎన్నేళ్లయినా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, నేతలు ముందు అవి అరణ్యరోదనగానే మిగిలిపోవడంతో, పులిగొంది వాసులు సర్పంచ్ రమణమ్మ, ఎంపిటిసి పద్మ దృష్టికి సమస్యను తీసుకెళ్ళి, తోచిన సాయం చేయాలని కోరారు. దీంతో వారు స్పందించి రేకులను సమకూర్చగా, గ్రామస్తుల సహకారంతో, శ్రమదానంతో తాత్కాలిక వసతికి రేకుల షెడ్ నిర్మాణానికి పూనుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, నేతలు కళ్లు తెరవాలని, పులిగొంది పాఠశాల వసతి కష్టాలను పరిశీలించి, శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సర్పంచ్ రమణమ్మతోపాటు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## నూతన విద్యా విధానంపై సదస్సు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** దేశ యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యమని ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఎయు విద్యా విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల జాతీయ సదస్సు "ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఇన్ఎన్ఇపి-2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ ఛాలెంజస్"ను ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

# రోడ్డు పనులు పున:ప్రారంభించాలి

### సిపిఎం ఆధ్వర్యాన గిరిజనుల ధర్నా : ఎంపిడిఒకు వినతి

**ప్రజాశక్తి -అనంతగిరి :** ప్రారంభంలోనే అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు వెంటనే పున: ప్రారంభించాలని కర్రిగోడ, కడరేవు గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. పనులు జరగకుండానే నిధులు స్వాహాకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళన చేపట్టారు. అనంతగిరి మూడు రోడ్ల కూడలి నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఎవివి.కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

గిరిజనుల ఆందోళనకు సంఘీభావం తెలిపి పాల్గొన్న జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, గుమ్మ పంచాయతీ పరిధి నిమ్మ ఊట నుంచి కర్రిగోడ, కడరేవుతోపాటు మరికొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు 2018.-19లో రూ. రెండు కోట్ల 20 లక్షలు ఎంజిఎన్ఆర్ఇజిస్ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు. నిమ్మ ఊట గ్రామం నుంచి కిలోమీటర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారని, అయితే పూర్తిఆ పనులు చేయకుండానే రూ.75 లక్షలు దుర్వినియోగానికి పాల్పడాలని ఆరోపించారు. ఏళ్ల తరబడి పనులు చేయకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అరకొర పనులు చేపట్టి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసంపూర్తి పనులను వెంటనే పున:ప్రారంభించి పూర్తిచేయకుంటే జిల్లా కలెక్టరేట్ వద్ద వంటావార్పు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ .నాగులు, గుమ్మ పంచాయతీ జోన్ బాధ్యులు కె. పూర్ణ, వార్డు సభ్యులు ఇ.పెంటన్న, గ్రామస్తులు పి రాజారావు, పి. గంగరాజు, కె రాజారావు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, రాజారావు

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ:** మండల కేంద్రంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఆ సంఘం మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా పి.హుస్సేన్, మండల అధ్యక్షుడిగా ఎస్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.రాజారావు, కోశాధికారిగా ఎం.మోహన్, ఉపాధ్యక్షులుగా ఎం.రామకృష్ణ, జి మల్లీశ్వరి, కార్యదర్శులుగా జి దుక్కు, కె.ప్రసాద్, పద్మనాభం, సుందర్, ఎపి. రాము, బి శ్రావణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మాసపత్రిక కార్యదర్శిగా ఆర్ మల్లికార్జున్, మహిళ విభాగం కార్యదర్శిగా భూలక్ష్మి, సిపిఎస్ కన్వీనర్‌గా లింగన్న ఆడిట్ కమిటీ సభ్యులుగా టి.కోటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, టి.మేఘనాథరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.బాబూరావు, ఎస్ కన్నయ్య, ఎన్.నారాయణ, ఎస్ బాలకృష్ణలనుఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అని, అధ్యయనం అధ్యాపనం, సామాజిక స్పృహ అనే సిద్ధాంతతో ఈ సంఘం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల్ల పరిష్కారంలో యుటిఎఫ్ ఎప్పుడూ ముందుండి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో లక్షకు పైగా సభ్యత్వాలు కలిగిన ఏకైక ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అన్నారు. కార్యక్రమంలో అసంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి- అనంతగిరి :** పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ కుమార్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ పంచాయతీల కార్యదర్శులతో పారిశుద్ధ్యం, ఎకో ఫ్రెండ్లీ టూరిజంపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న మూడు నెలలు అనంతగిరి మండలంలో పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రిసార్ట్స్, హోటల్స్, కిరాణా షాపుల్లో తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రిసార్ట్స్‌లో తప్పనిసరిగా రూమ్‌ల వివరాలు పర్యాటకులకు కనిపించేలా డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎకో ఫ్రెండ్లీ టూరిజంలో భాగంగా ఎవరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని, కేవలం జ్యూట్ బ్యాగ్స్, , ఇస్తారుకులతో చేసిన ప్లేట్లు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అందరు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, పర్యాటక తాకిడి ఉన్న ప్రాంతాల్లో అదనపు పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేయాలని కోరారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

## రిసార్టుల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే శిక్షలు

**ప్రజాశక్తి - చింతపల్లి :** మన్యంలోని పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, తాజంగి, పెదబరడ పంచాయతీలలో పర్యాటకుల కోసం నెలకొల్పిన రిసార్ట్స్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని చింతపల్లి డిఎస్‌పి షహబాజ్ అహ్మద్ సూచించారు.రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో రిసార్ట్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. అలాగే మండల పరిషత్ సమావేశం మందిరంలో ఇఒపిఆర్డఇ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మరో సమావేశంలో తహసిల్దార్ రవికుమార్ పాల్గొని మాట్లాడారు. రిసార్టలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పక్కాగా రికార్డులు ఉండాలని, విధిగా పర్యాటకుల ఆధార్ నెంబరు నమోదు చేయాలన్నారు. సందర్శనకు వచ్చిన పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, రిసార్ట్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యుత్తుశాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ రిసార్టుల్లో విద్యుత్తు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మించవద్దని, అనధి కారికంగా విద్యుత్తును ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల్లో రిసార్ట్స్ నిర్మాణాలు చేయవద్దని తహసీల్దారు రవికుమార్ తెలిపారు. కార్యక్రమాలలో వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, పోలీసులు, రిసార్ట్స్ యజమానులు హాజరయ్యారు.




ప్రణవ్‌గోపాల్‌ను అభినందిస్తున్న సత్యనారాయణ

## ప్రణవ్‌గోపాల్‌కు అభినందన

**ప్రజాశక్తి-హుకుంపేట:** విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి ప్రణవ్‌గోపాల్‌ను టిఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తామర్ల సత్యనారాయణ అభినందించారు. విశాఖనగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా, మండలస్థాయిలో బలోపేతానికి ప్రణవగోపాల్ ఇతోధిక కృషి చేశారని, విద్యార్థుల సమస్యలపైనా, టిడిపి చేపట్టే ధర్మం గెలవాలి తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, అటు యూనియన్, ఇటు పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన సిఎం చంద్రబాబు విఎంఆర్‌డిఎ చైర్మన్‌గా గురుతర బాధ్యతలను అప్పగించారని, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆకాంక్షించారు. టిడిపి ఎస్‌టి సెల్ అరకు అసెంబ్లీ అధ్యక్షుడు సర్పంచ్ పలాసి భూషణంనాయుడు ఉన్నారు.

## ఎయులో సిపి బ్రౌన్ జయంతి

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సిపి బ్రౌన్ 226 జయంతిని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ, సి.పి.బ్రౌన్ తెలుగు సాహిత్యానికి ఆర్థ్యం పోశారని, సాహిత్యం ఉన్నంత కాలం బ్రౌన్ చిరస్మరణీయుడు అని పేర్కొన్నారు. ఆంగ్ల శాఖాధిపతి బెన్నీ మాట్లాడుతూ, సిపి బ్రౌన్ సాహిత్యానికి చేసిన సేవ మరువలేనిదన్నారు. ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ, అమూల్యమైన తాళపత్ర గ్రంథాల సేకరణ, సంస్కరణలో, పరిష్కరణలో, ముద్రణలో, వ్యాకరణ రచన, నిఘంటు నిర్మాణం, రచనలు, వ్యాసాలు, తెలుగు వాచకం రాయడంలో తెలుగువారికి ఆదర్శప్రాయుడు, మార్గదర్శి ప్రొఫెసర్ సిపి బ్రౌన్ అన్నారు. పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ, వేమన లాంటి మహాకవిని బయటికి తీసి ఎన్నో తెలుగు సాహిత్య తాళపత్ర గ్రంథాల్ని ప్రజలకు సిపి బ్రౌన్ చేరవేశారని గుర్తుచేశారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న డిఆర్‌పి గిరి

## సీలేరులో గ్రామసభ

**ప్రజాశక్తి - సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఇజిఎస్ డిఆర్‌పి గిరి, టెక్నికల్ అసిస్టెంట్ చిన్నబ్బాయి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు ఎన్ఆర్ఇజిఎస్ నిధులు 5 లక్షల రూపాయలకు ఉపాధి పనులు నిర్వహించామని తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులకు అర్హులని పేర్కొన్నారు. సీలేరు పంచాయతీ పరిధిలో చేయవలసిన పనుల గురించి ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, ఉప సర్పంచ్ కే.వల్లిప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, డిజిటల్ అసిస్టెంట్ విజియా, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ మంజూరు చేయాలి

**ప్రజాశక్తి - రంపచోడవరం, దేవీపట్నం :** ఆదివాసీ రైతులకు సబ్సిడీ ద్వారా సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ మంజూరు చేయాలని ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలానికి ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ముసురు మిల్లి ప్రాజెక్ట్ కాలువకు దేవీపట్నం మండలం, ఇందుకూరు గ్రామ పంచాయితీ పరిధిలోని చిన్న భీంపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు నుండి శరభవరం గ్రామ పంచాయితీ పరిధిలోని ఎస్.రామన్నపాలెం గ్రామం వరకు పూడిక తీత తీయాలని, లేకుంటే కాలువకు గండిపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకూరు గ్రామ పంచాయితీ పరిధిలోని కొత్త వీధి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు ఆట స్థలం మంజూరు చేయాలని, అభయ హస్తం పథకం ద్వారా కట్టిన డబ్బులు బాండ్ కాల పరిమితి పూర్తయిన వారికి తిరిగి డబ్బులు చెల్లించాలని, కొండ పోడు పట్టాలు ఇచ్చిన ఆదివాసీ పేదలకు రీ సర్వే చేసి భూములు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో కుంజం చిన్నాలు దొర, ఈక నరసన్న దొర తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసుపై సమగ్ర విచారణ జరిపించాలి

**ప్రజాశక్తి-రంపచోడవరం :** ఇటీవల తనపై పెట్టిన అక్రమ అట్రాసిటీ కేసుపై సమగ్ర విచారణ జరిపి, ఈ తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపైనా, వెనుకున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలు అక్కసా సోమవారం ఒక ప్రకటనలో పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తాను కబ్జా చేశానని చెబుతున్న భూమి కొనుగోలు చేసిందని, కొనుగోలు చేసింది కూడా గిరిజనులేనని పేర్కొన్నారు. నాడు 100 రూపాయలు దస్తావేజు మీద రాసి వారు సంతకం కూడా పెట్టారని, వారికి డబ్బులు ఇచ్చినట్లుగా కూడా సాక్షాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ ప్రదేశంలో గెస్ట్‌హౌస్‌లు వచ్చాక ధరలు భూమి ధర పెరిగిందని, దీంతో టిడిపి నాయకులు కూరగాయల రాజు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి ఆ భూమిని వేరే వారికి అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ భూమిగల వారికి తాను అండగా నిలబడితే, తనపై తప్పుడు కేసులను పెట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ కేసుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అంతా వివరిస్తామని తెలిపారు.

## 14 నుండి విఎంఆర్‌డిఎ బాలల ప్రాంగణంలో కార్యక్రమాలు పున:ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విఎంఆర్‌డిఎ బాలల ప్రాంగణంలో ఈ నెల 14 నుంచి పిల్లల సంబంధిత కార్యక్రమాలు పున్ణ ప్రారంభమవుతాయని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెహ్రూ జయంతి (బాలల దినోత్సవం)ని పురస్కరించుకొని ఆ రోజు నుండి పిల్లల కార్యక్రమాలు ప్రతి 15 రోజులకొకసారి కొనసాగిస్తామని తెలిపారు.

# దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు మాల్దా టౌన్ - ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడపనుంది. ఆ రైళ్లు దువ్వాడ మీదుగా ప్రయాణించనున్నాయి. అందులో భాగంగా 03403 మాల్దా టౌన్ - ఎస్ఎంవిటి బెంగళూరు అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ 11 సోమవారం సాయంత్రం 17:30 గంటలకు మాల్దా టౌన్ నుంచి బయలుదేరి, మూడో రోజు బుధవారం అర్ధరాత్రి 1:00 గంటకు దువ్వాడ చేరుకొని 01:05 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 19:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది.

03404 ఎస్ఎంవిటి బెంగళూరు - మాల్దా టౌన్ అన్‌రిజర్వ్‌డ్ స్పెషల్ రైలు నవంబర్ 14 గురువారం ఉదయం 7:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటిరోజు శుక్రవారం తెల్లవారుజామున 2:28 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 2:30 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 8:00 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి.

# సెవెన్ హిల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో పని చేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురి చేస్తోందన్నారు. హాస్పిటల్ ఆర్థిక సంక్షోభంలో ఉంది కాబట్టి కార్మికులను తొలగిస్తున్నామని యాజమాన్యం కుంటుసాకు చెప్పి, కార్మికులను నిర్బంధించి నోటీసులపై హెచ్‌ఆర్ అధికారి భాను సంతకాలు చేయించడం చట్ట విరుద్ధమన్నారు. మరో పక్క కొత్తగా కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగాల్లో పెట్టుకోవడం దారుణమన్నారు. సంవత్సరాల తరబడి పని చేస్తున్న సీనియర్ కార్మికులను తొలగించడం సముచితం కాదన్నారు. సెవెన్ హిల్స్ యాజమాన్యంపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు లేబర్ డిపార్ట్మెంట్‌కు ఇచ్చినప్పటికీ స్పందన లేదన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా దర్యాప్తు జరిపి న్యాయం చేయాలన్నారు. సీనియర్ కార్మికులకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని, 15 రోజుల బకాయి జీతాలను ఫెనాల్టీతో సహా చెల్లించాలని, ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** సకాలంలో ప్రతి ఒక్కరికీ కేన్సర్ పరీక్షలు నిర్వహించి, స్క్రీనింగ్ టెస్ట్ చేయటం ద్వారా వ్యాధిని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఎన్‌సిడి 3.0 సమగ్ర కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అందుకు సంబంధించి సోమవారం కలెక్టరేట్ అసెంబ్లీ హాల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడి 3.0లో భాగంగా సిబ్బంది వెళ్లి అన్నిచోట్లా సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ నెల 14 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభవుతుందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఎన్‌సిడి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 30 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు నోటి కేన్సర్ గుర్తింపు కోసం పరీక్షలు చేయించుకోవాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు, రొమ్ము, గర్భాశయ కేన్సర్‌ల గుర్తింపు కోసం వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అసాధారణ కేసులను వైద్యాధికారులు పరీక్షించి, అనుమానితులను మంగళ, శుక్రవారాల్లో ఫాస్ట్ ట్రాక్ ఛానెల్‌తో కెజిహెచ్ ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌కి సూచిస్తారని చెప్పారు. జిల్లా ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విశ్వ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** శ్రీ విశ్వ కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి సుమారు 40 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. సంఘం నాయకులు సోమవారం శ్రీ విశ్వ కళాశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం కాలేజీకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు జి.అజయ్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి శ్రీ విశ్వ కళాశాల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని, తక్షణమే శ్రీ విశ్వ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేయాలన్నారు. కళాశాలల హాస్టల్స్‌లో ఇలాంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు నిరంతరం జరుగుతున్నాయని, అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.

## పింఛను ఇప్పించండి మహా ప్రభో..

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన 1239 మంది పెన్షనర్లకు అక్టోబర్ నెల పెన్షన్ నేటి వరకు జమ కాలేదని, దీంతో పింఛన్ మీదే ఆధారపడి బతుకుతున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థల పింఛనుదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర విద్య, గ్రంథాలయ శాఖ మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఈ మేరకు ఈ - మెయిల్ ద్వారా ఆయన వినతిపత్రం పంపించారు.

## డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై ప్రచారం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కేంద్ర ప్రభుత్వ పింఛనుదారుల కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచారాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖలో ప్రారంభించింది. జాతీయంగా డిసిఎల్ క్యాంపెయిన్ 3.0 పేరిట ఈ ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రణాళికలు రచించినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు.

నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్ తదితరులు

## ఆజాద్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి-పాడేరు:** దేశంలో ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్థాపించడానికి మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేసారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం మౌలానా అజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ముస్లిం పెద్దలతో కలిసి ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషికి గుర్తింపుగా ఏటా ఆయన జయంతి రోజున జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మౌలానా ఆజాద్‌గా అందరికి సుపరిచితులైన అబుల్ కలాం పేరులో మౌలానా అంటే మాస్టర్ అని, ఆజాద్ అంటే ఉచితం అని అర్థం చెప్పిన కలెక్టర్, ఆయన పెన్ పేరును ఆజాద్ అని పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత ఎపిఎంఐపి పిడి బి.ఎ.రహీం, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అహ్మద్ మొహిద్దీన్, పాల్గొన్నారు.

**చింతూరు :** స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ విద్యా విధానంలో భాగంగా ఐఐటి, ఏఐసిటిఇ , యుజిసి, బాల బాలికల విద్యా హక్కు చట్టం, భారత రాజ్యాంగ రచనలో మైనారిటీల హక్కులను పొందుపరచడానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్‌సి హెచ్.నాగేశ్వరరావు, కె.శైలజ, వై.పద్మ, కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, కె.శ్రీలక్ష్మి, ఆర్.మౌనిక, జి.సాయికుమార్, పి.అలివేలు, ఎన్.రమేష్, బి.శ్రీనివాసరావు, సుభద్ర పాల్గొన్నారు.

**సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు విద్య -ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విదార్థి పి.సంకీర్తన ప్రథమ స్థానం, కె.వెంకటలక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలు సీజ్

**ప్రజాశక్తి-ఎటపాక :** అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్లను, ఒక జెసిబిని ఎటపాక రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండల పరిధిలోని పిచ్చుకులపాడు నుంచి భద్రాచలానికి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రెవిన్యూ సిబ్బంది ఆదివారం అర్థరాత్రి సుమారు రెండు గంటల సమయంలో దాడులు చేశారు. మట్టి తరలిస్తున్న నాలుగు టిప్పర్‌లను, ఒక జేసీబీని పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో తహసీల్దార్ కారం సుబ్బారావు, విఆర్వో పండా రామకృష్ణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరి పిల్లలకూ స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి స్కూల్ ఫీజు రాయితీ విషయమై వినతి పత్రం సమర్పించారు.